


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

నవంబర్ 2014

సంపుటి : 20 (237) సంచిక : 11




## విశ్వమే నా కుటుంబం అనుకున్ననాడు విశ్వహితం కోరునాడు వివాదములుంటాయా? విధ్వంసములుంటాయా?

తెలుగులు – ఆంధ్రులూ ఒకటే! ఆంధ్రులూ భారతీయులొకటే! భారతీయులూ విశ్వజనులూ ఒకటే.

చెలిమి చలములు ఊరేదాకా, చెలిమి బలములు నిలిచేదాకా, చెలిమి వెన్నెలలు కాసేదాకా, చెలిమిరాగములు బతికేదా– బ్రతుకమ్మ – బ్రతుకు అన్నాడు ప్రజాకవి కాళోజీ నారాయణరావు.

భావుకత్వం, కోమలత్వం, సరసత్వం, సరస్వతీత్తం, దయాళుత్వం, క్షమత్వం, ప్రజ్ఞాత్వం, ప్రసన్నత్వం, మధురత్వం, మంజులత్వం, మిత్రత్వం, కళాప్రియత్వములను హృదయంలో పాదుకొలుపుకుని, ప్రోదికావించేవారికి, వారి సన్నిహితులకు, హితులకూ ఆనందానుభూతి కలుగకుండా ఉండనే ఉండదు కదా!

ఒకభాష, ఒక ప్రాంతం ఉండాలనుకోవడంలోని అంతరార్థం కలిసికట్టుతనం, కలిమితనం, కలహలేమితనానికి ఉద్దేశింపబడింది.

ఆంధ్రుడు / తెలుగువాడెపుడో హృదయాన్ని విస్తృతపరచుకున్నాడు. నదులు సాగరములు దాటాడు. అప్పుడు ప్రపంచ చిత్రపటం లేదు. విమానములు లేవు, రైళ్లు లేవు, యాంత్రికమైనవేవీ లేవు. గాలి ఓడలూ, పడవలే ఉన్నవి. గాలి ఎటువీస్తే అటు వెళ్ళేవిగానీ వాటికి దిశానిర్దేశం లేదు. భూమి, వాసములు కనపడేసరికి బ్రహ్మానందం కందితుడౌతూ అక్కడ తెలుగువాడు అడుగుపెట్టేవాడు, తనతో తెచ్చుకున్న ఉత్పత్తి వస్తువులను విక్రయించేవాడు, అప్పుడతడికా దేశమేదో తెలియదు; భాష యేదో తెలియదు. ఈ రెండిటికీ అతీతంగా వారితో మనసులు కలుపుకోవడానికి పైన ఉదహరించిన సదుత్తమ భావాలే సత్తువులయ్యాయి.

ఆంధ్రుడన్నా, తెలుగువాడన్నా, భారతీయులన్నా ఏకభావమే! ఏకభావంతోనే ప్రపంచంలోని అన్ని దేశాల్నూ కలుపుకున్నాడు. చేపలా ఈదుకు వెళ్ళాడు. చీమలా యోజనాలకు యోజనాలు పయనం చేసాడు; ప్రయోజకుడనిపించుకున్నాడు. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ తెలుగువాడుండడానికీ, ఉనికి యేర్పరచుకోవ డానికే ఈ కలుపుగోరు కారణమైంది!

ఇన్ని ఖండాలూ, ఇన్ని దేశాలూ ఉన్నాయని ఆనాడెవడూ ఊహించలేదు; ఊహకు అతీతంగా వ్యవహరించాడు. ప్రస్తుత విద్యాధికులు కొలంబస్ గురించి చెబుతారు? వాస్కోడిగామా గురించి చెబుతారు. కానీ మర ఓడలులేని ఆ రోజుల్లో గాలి తెరలు కట్టిన నౌకలో పయనించారు. ఆ ఓడ ఏ దేశతీరం చేరితే తెలుగువాడు అక్కడ అడుగుపెట్టాడు. ఆ అడుగును బలంగా వేసాడు, వాణిజ్యం చేసారు. ఆ దేశసంస్కృతిని అధ్యయనం చేసాడు. అవగాహనం చేసుకున్నాడు. విద్యనభ్యసించాడు; వినయం పెంచుకున్నాడు. సహజంగా తెలుగువారికుండే విధేయత, విజ్ఞత, కృతజ్ఞతలే అలంకారములయ్యాయి.


**కృతఘ్నే నాస్తి నిష్కృతీ** – అన్న ఆర్యోక్తి.

మనిషిలోని దైవత్వాన్ని చూసాడు. మట్టిలోని దైవత్వాన్ని చూసాడు, ఆకాశంలోని దైవత్వాన్ని చూసాడు.

రాముణ్ణి ఆదర్శంగా తీసుకున్నాడు, ఆత్మ రాముణ్ణి ఆరాధించాడు. విగ్రహారాధనతోనే మనస్సును కట్టివేయవచ్చునని విశ్వానికెరుకపరిచింది తెలుగువాడే! విశ్వరహస్యాలు తెలిపినది తెలుగువాడే! విశ్వాత్మకుడు తెలుగువాడే! విశ్వకుటుంబ విస్తరణమే విశ్వశాన్తికరమన్నదీ తెలుగువాడే! ఈ విశ్వాన్ని ఏదో అనూహ్యమైన శక్తి నడిపిస్తుందనీ, ఆ శక్తే భగవంతుడని నిరూపించిన వాడూ తెలుగువాడే.

తెలుగువాడిని వినా జగతిని ఊహించలేము. తెలుగువాడి వినాప్రగతి నూహించలేము.

ఇంతటి ప్రతిభావంతుడైన తెలుగువాడు వందల సంవత్సరాల తెలుగు భాషను మరువడం తమను తాము హత్య చేసుకోవడమే అవుతుంది. **ఏను తెలుగు వల్లభుడననే శ్రీకృష్ణదేవరాయల్ను స్మరించే** వాళ్ళు తెలుగుభాషనూ అభిమానించాలి! ఆరాధించాలి!



దీపావళి దివ్యవెలుగుల్లో, శతకోటి సహస్ర జ్యోతుల తెలుగు వైభవాన్ని చాటిచెబుదాం. ఎన్ని ఇతర భాషలను నేర్చినా, తెలుగు నిరక్షరాస్యు డుండరాదని శపథం చేద్దాం!

వందే తెలుగుమాతరమ్! వందే భారత మాతరమ్! తెలుగు వర్ధిల్లు గాక!

బుధజన విధేయుడు

**– గోటేటి శ్రీరామారావు**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# వేయి కోటుల శ్రీ మహాలక్ష్మి వైభవ మహాలక్ష్మిని కొలుదము రారమ్మా'



## - దీపావళి అంటే దివ్య మహాలక్ష్మి ఆరాధనమే! -

దివ్య మహాలక్ష్మీ, దీప మహాలక్ష్మీ, వైభవలక్ష్మీ హరివల్లభలక్ష్మీ, విద్యాలక్ష్మీ, వరాల వైభవలక్ష్మీ క్షీరసముద్రరాజ తనయా- శ్రీమహాలక్ష్మీయే శ్రీమహాలక్ష్మీ క్షీరసాగరమదనంలో పుట్టిన తరువాతనే ఇతరములన్నీ పుట్టాయి. ఆమెను చూడగానే క్షీరసాగర శయనుడామెను తనపత్నిగా స్వీకరించాడు. ఎన్ని అవతారములెత్తినా, లక్ష్మినే తన మహాలక్ష్మిగా చేసుకున్నాడు. సిరిసంపదలు కలుగాలంటే శ్రీ మహాలక్ష్మిని ఆరాధించాలి. చిక్కటి కటిక చీకటుల అమావాస్య రోజున శ్రీమహాలక్ష్మి దీపలక్ష్మిగా వెలుగులను నింపుతుంది.

అధర్వణ వేదం, పద్మపురాణం, విష్ణుపురాణం, భగవత్మకరందం శ్రీమహాలక్ష్మి వైభవాన్ని వివరించాయ్. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగములలో శ్రీమహాలక్ష్మి సిరులు కురిపించింది. పాండవులకు విజయలక్ష్మిని చేకూర్చింది.

శంకర భగవత్పాదులు ఓ పేదింటి గృహిణి దరిద్రం తీర్చడం కోసం కనకధారాస్తోత్రం చేసారు.

క్రూరుడైన నరకాసురుణ్ణి వధించి, లోకాలకు వెలుగుల్ని ప్రసాదించినది శ్రీమహాలక్ష్మే!

దీపావళిరోజున సహస్రసిరి, శిరఃకాంతుల తల్లి శ్రీమహాలక్ష్మి పూజలొనర్చి సకల సౌభాగ్యములనూ పొందండి. ఐశ్వర్య భాగ్యం లేనపుడు ఆయుర్భాగ్యముండీ ప్రయోజనం లేదు. ఐశ్వర్యభాగ్యం కోసం శ్రీవైభవ మహాలక్ష్మిని పూజించండి. నూతన దస్త్రాలు పెట్టుకుని పూజించే అంతరార్థం అదే.

**సకల సన్మంగాళనిభవన్తు! సకల ఐశ్వర్యాభివృద్ధిరస్తు!!**

# వేదమాత! ఆయుర్వేదమాత ఒకరే!

## వ్యాసుడులేనిచో వేదముల్లేవు - చరకుడుల్లేకపోతే ఆయుర్వేదమే లేదు

విశ్వానికి ప్రకృతే వైద్యాలయమనీ, ప్రకృతిపై మొలచిన భూమిలో వేళ్లూనుకుని వున్న వనసంపత్తిలోనే ఔషధాలున్నాయని భారతదేశమే తేల్చిచెప్పినది!

ఏ దేశానికీ లేని గొప్పదనం భారతదేశానికున్నది. వేదాల్ను ఎవరో వ్రాయలేదు. వ్యాసఋషిప్రోక్తం. వేదముల్లోని అంతర్వేదమే ఆయుర్వేదం.

మనిషి నూరేండ్లు గాకుండా నూటయిరవై ఏండ్లు బ్రతకాలన్నది శాస్త్రం. చాలామంది తెలుగు యోగులే రెండుమూడు వందలయేండ్లు జీవించారు. ఈ విషయాన్ని కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామివారు కూడా తమ ఉపన్యాసముల్లో సిద్ధీకరించినట్లు చెప్పారు. ఇప్పటికీ హిమాలయ పర్వతాల్లో దృశ్యాదృశ్యంగా వారున్నారు. త్రేతాయుగం నాటి ఆంజనేయులు వారు హిమత్పర్వతాల్లో తిరుగుతున్నారు. నిజానికి ఆయన వైద్యులు కన్నా గొప్ప వైద్యుడు. పర్వతంతో సహా సంజీవనీ మూలికామొలకను తెచ్చి, లక్ష్మణుని ప్రాణాలను కాపాడారు. రామరావణ యుద్ధంలో విగత జీవులైన వానరుల్ని ఈ మూలికలు, ఆకుపసర్లే బ్రతికించాయ్. నా చిన్నపుడు చెవిపోటువస్తే రుద్ర జడాకు రసం పిండిపోసేవారు! అరటి, పనస, బాదం, తమలపాకుల్ని నూనె కానీ, ఆముదం కానీ రాసి, నిప్పుసెగ చూపించి, నొప్పివున్న శరీరభాగానికి కట్టేవారు. పసరు వైద్యంచేసేవారు. వాత, పిత్త, కఫములను నివారింపచేసేవారు.

కొన్ని సంవత్సరాల క్రితం, నేను చింతలూరు వెళ్లినపుడు– శ్రీవెంకటేశ్వరా ఆయుర్వేద నిలయం, వారిఆలయంలో ఎన్నో ఆకుల్ని నిక్షిప్తంచేయడం చూశాను. ఈ విషయంలో ద్విభాష్యం శ్రీరామమూర్తి (మేనేజింగ్ డైరెక్టరు) నాకు సహకరించారు. వారి తాతతండ్రులీ వైద్య ప్రదాతలు, కేసరిగారు మద్రాసులో స్త్రీల గర్భాశయ వ్యాధులకు 'లోధ్ర' అనే ఓ కషాయాన్ని సీసాల్లో విక్రయించేవారు.

మా నాన్నగారైన గోటేటి విస్సంరాజుగారు బంగారాన్ని పుటం వేసి స్వర్ణ కాంతవల్లభ రసం, వసంతకుసుమాకరం వాడేవారు. ఆయన స్వయంగా తయారుచేసిన అగ్నితుండితో సర్వజ్వరాలను నివారింపచేసేవారు. ఆయుర్వేదంలో



నివారణ కాని వ్యాధులంటూ లేవు. ముఖ్యంగా ఆయుర్వేదానికి భూమిపైనా, భూమిలోనున్న తీగలూ, వేరులే ప్రధాన ఔషధ మూలికలు. పొట్టి శ్రీరాములు గారు చివరివరకూ ఆయుర్వేద ఔషధాలనే తీసుకునేవారు. ఆ రోజుల్లో డా॥ కస్తూరి నారాయణమూర్తిగారూ, ఆచంట రుక్మిణీపతి వంటి ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులుండేవారు. రక్తపరీక్షలకుగానీ, రక్తపోటుకుగానీ, క్షయనుగానీ పరీక్షించి చెప్పడానికి చికిత్సా పరికరాలు లేవు. చేతినాడిని జూచే రోగనిర్ధారణ చేసేవారు. ఈ నాటికినీ ఇంగ్లీషు వైద్యంలో, హోమియో వైద్యంలో నాడిని, నాడి వేగాన్ని (పల్స్‌రేటు) చూడకుండా ఉండే వైద్యులు లేరు. స్టెతస్కోపు పెట్టుకోకుండా గుండెను పరిశీలించలేరు.

ఇదేదో కొత్త విధానం చెడ్డదనీ, పాతవిధానం శ్రేష్ఠమైనదనీ చెప్పడానికీ వ్యాసాన్ని ఉద్దేశించలేదు. కానీ, వేదం ప్రాతిపదికగానే వైద్యాలు పుట్టాయ్. శస్త్ర చికిత్సలకు కూడా ఆనాటి శస్త్రచికిత్స ప్రాతిపదికనే వచ్చాయ్. ఈ రోజు యిచ్చే మత్తు మందులకు బదులు ఆ రోజుల్లో ద్రాక్షరసం త్రాగించేవారు.

మూలాల్ని మరవడం మన నైజం. మన మూలికలతోనే ఇంగ్లీషు మందులు తయారవుతున్నాయ్. మనవాడు డా॥ సుబ్బారావు పెన్సిలిన్ కనిపెట్టాడు. మన వాడు నోరి దత్తాత్రేయులు, ఇమంది వెంకట్రావులు అమెరికాలో కాన్సర్ స్పెషలిస్టులు, మన పోలవరపు తులసీదేవి, గెద్దం దశరథరామిరెడ్డి, గంటి సుబ్రహ్మణ్యం గారలు అక్కడ ప్రముఖ వైద్యులు (కొందరి పేర్లు నాకు తెలియకుండా ఉండవచ్చు)


ఇంగ్లాండులోని డాక్టర్లందరూ మనవాళ్ళే, దుబాయ్, సింగపూర్, కౌలాలంపూర్‌ల్లో మన డాక్టర్లే మేటి డాక్టర్లు. ప్రపంచదేశాల్లో వెదికి వెదికి పట్టుకుంటే దేశానికి పదిమందైనా మన డాక్టర్లుంటారు. ఈ డాక్టర్ల ఆధునిక వైద్యానికి ప్రాతిపదిక ఆయుర్వేదం, ఆయుర్వేదం చతుర్వేదాల్లోని అంతర్వేదం. ●


రాబడిని పెంచే లక్ష్మీ స్వరూపమైన

ధర రూ. 400/- మాత్రమే

**లక్ష్మీ గవ్వలు**

Lakshmi Gavvalu



లక్ష్మీ గవ్వలు లక్ష్మీ స్వరూపం. ఇందులో లక్ష్మీదేవి నివాసమై ఉంటుందని పురాణాలు ఉద్ఘాటిస్తున్నాయి. ఓ తెల్లని వస్త్రానికి పసుపు పూసి అందులో ఈ లక్ష్మీ గవ్వలను మూటగట్టి ఇంట్లో పెట్టుకుని పూజిస్తే కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగి ఒకరికొకరు సహాయ సహకారాన్ని అందించుకుంటూ ఆనందంగా జీవితాన్ని గడుపుతారు. రాబడి పెరుగుతుంది. అనారోగ్యం తొలగుతుంది. వ్యాపార స్థలంలో పెట్టుకుంటే వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. పనివాళ్ళు నుండి మీకు ఎటువంటి ఒత్తిళ్ళుండవు. మీరు కోరిన విధంగా మీపై గౌరవ మర్యాదలతో పనిచేస్తారు. ఉద్యోగస్తులు జేబులో పెట్టుకుంటే తోటి ఉద్యోగస్తులనుండి సమస్యలు రావు. ఈ గవ్వలను తాకి ఏ పని మొదలెట్టినా అది విజయవంతమౌతుంది.

డా॥ మల్లంపల్లి రామలింగ శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

Estd. 1975

: 09840259871, 04424837505

BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra



**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# పరిపూర్ణ ప్రేమావతారమూర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జన్మదినం ఈ నవంబరులోనే!



అఖిల మానవులకు నానందమొనగూర్చి
రక్షించుచుండుటే దీక్ష నాకు!
సన్మార్గమును వీడి చరియించువారల
పట్టి కాపాడుటే వ్రతము నాకు!
బీదసాదలకైనను పెను బాధ తొలగించి
లేమిని బాపుటే ప్రేమ నాకు!
మంచి చెడు కూడ మనసులో సమముగా
భావించుచుండుటే భక్తి నాకు!
ఆశ్రితానను దీతడే యాప్తబంధు–
వనగ బేరొంది నాయందు నలవరువారి
నెన్నడును మరువబోను నేనిదియే నిజము
అట్టి నా పేరు చెడుట యెట్లగును భువిని.

–అని అంటూ తన అవతార లక్ష్యాన్ని వివరించారు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు. 85 సం॥లు భగవాన్ బాబావారి జీవిత ప్రస్థానాన్ని ఒక్కతూరి పరిశీలిస్తే పైన పేర్కొన్న లక్ష్యము మనకవగతమవుతుంది. అఖిల మానవాళిపై అవ్యాజప్రేమతో ఆయన నిర్వహిస్తున్న అనేకానేక ధార్మిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిశ్శబ్ద విప్లవములే! మానవాళి మనోఫలకాలపై మరువలేని, మరపురాని దివ్య ప్రదమైన ముద్రను వేయుచున్నాయనడం యదార్థం. దీనికి నిదర్శనంగానే ప్రపంచంలోని 270 దేశాల నుండి అసంఖ్యాకంగా భక్తులు ప్రశాంతి నిలయానికి విచ్చేయుచున్నారు. ప్రశాంతి నిలయము ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రముగా మారడమే గాక అన్ని మతాల వారు, అన్ని జాతులవారు వారి వారి ఇష్టదైవాలను బాబావారిలో చూచుకుంటూ, ఆరాధించుకుంటూ బాబావారు చూపుతున్న ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ ఉండడమే అన్నింటికన్నా మించిన అత్యంత అద్భుత దివ్యలీల.

## ఉచిత అత్యుత్తమ ఆధ్యాత్మిక విద్య :

నిజమైన విద్య అంటే ఆధ్యాత్మిక విద్య అని, విద్యార్థికి కావలసినవి సత్ప్రవర్తన, సద్బుద్ధి వంటి సద్గుణాలని దాని ఆవశ్యకతను తెలియచెప్పి ఆయనే ఒక విశ్వ విద్యాలయాన్ని స్థాపించి, దాని ద్వారా విద్యార్థులను వివేకవంతులుగా మారుస్తు న్నారు. సరస్వతీ నిలయాలు లక్ష్మీ నిలయాలుగా మారి విద్యా సంస్థలు విద్యార్థులను తయారుచేసే కర్మాగారాలుగా మారి విద్యావిధానం వెక్కిరితలలు వేస్తున్న ఈ తరుణంలో కేవలం విద్య ధనసముపార్జనకే కాదని, గుణ సముపార్జనకే అని నిరూపిస్తూ కె.జి. నుండి పి.జి. వరకు ఉచిత విద్య ద్వారా అత్యుత్తమ సంస్కారాన్ని అందిస్తున్నారు. గుణవంతులైన యువతీ యువకులను నేటి సమాజానికి అందిస్తున్నారు భగవాన్ బాబావారు. భగవాన్ బాబా అందిస్తున్న ఈ అత్యావశ్యకమైన విద్యావిధానాన్ని ఎంతోమంది మేధావులు, విద్యావంతులు కొన్ని ప్రభుత్వాలు సైతం ఆచరణలో పెట్టి అనూహ్య, అద్భుత, అభిలషణీయమైన ఫలితాలు పొందుతున్నారు.

## ఉచిత అత్యుత్తమ వైద్యము :

కోటీశ్వరుడైన, కడుపేదవాడైన రోగాలబారిన పడినపుడు వైద్యము తప్పనిసరి. కాని శ్రీమంతుడు ఎంత ఖర్చైననూ వైద్యం చేయించుకోగలరు. మరి పేదవాని పరిస్థితి ఏమిటి? దీనులకు ఆపన్నులకు, రోగపీడితులకు కుల, మత, వర్గ, ప్రాంత విచక్షణలకు అతీతంగా అత్యంత వ్యయంతో కూడిన, అతి క్లిష్టమైన, అరుదైన వైద్యమును ఉచితముగా అందిస్తున్నారు. వందల కోట్ల రూపాయలను వెచ్చించి పుట్టపర్తి బెంగుళూరులలో భగవాన్ బాబావారిచే స్థాపించబడిన శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు నిస్వార్థ, ఉచిత, ఆదర్శ వైద్యసేవలను అందిస్తున్న వైనం యావత్ప్రపంచానికి ఆదర్శదాయకం. ఇంతటి మహత్తర కార్యాన్ని భగవాన్ బాబావారు చేసి చూపించి జగత్తుకే ఆదర్శ పురుషుడైనాడు. ఈ క్రింది పేర్కొన్న గణాంక వివరాల ప్రకారం నవంబరు 2009 నాటి వరకు పుట్టపర్తి, బెంగుళూరు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో ఉచిత ఆపరేషన్‌లు పొందిన రోగుల సంఖ్య పరిశీలిస్తే భగవాన్ బాబావారు దీనజనావళిపై, రోగపీడితులపై ఎంత ప్రేమతో ఉచిత వైద్యసేవలను అందిస్తున్నారో అవగతమౌతుంది. ఒక్క నయాపైసా కూడా తీసుకోకుండా లక్షల విలువ చేసే ఇన్ని వేల ఆపరేషన్లు చేయించడం ఒక్క భగవాన్ బాబావారికే సాధ్యమైంది.

| వైద్యవిభాగము | చేసిన ఆపరేషన్ల సంఖ్య | వైద్యవిభాగము | చేసిన ఆపరేషన్ల సంఖ్య |
|---|---|---|---|
| కార్డియాలజి | 53,119 | యూరాలజి | 43,493 |
| న్యూరో సర్జరి | 10,710 | ఆర్థోపెడిక్స్ | 4,608 |
| ఆప్తమాలజీ | 48,096 | GI ఎండోస్కోప్ | 1,927 |
| ప్లాస్టిక్ సర్జరి | 3,832 | | |

భగవాన్ బాబావారు మానవాళికి అందిస్తున్న ఈ ఉచితవైద్య సేవలను ఆదర్శంగా తీసుకొని యావత్ప్రపంచములోని ఆయన భక్తులు వారివారి స్థాయిలలో ఉచిత వైద్య సేవాశిబిరాలను, రక్తదానాలను, దీర్ఘరోగులకు ఉచిత వైద్యము మున్నగు అనేక వైద్య సేవాకార్యక్రమాలను అందించాలి. భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థల ద్వారా అందించడముకు అభివాదం చేయాలి.

## శ్రీ సత్యసాయి సుజల మంచినీటి పథకము:

జలము జీవనాధారము, ప్రాణాధారము, అటువంటి జలము ఈ రోజున అన్ని ప్రాంతాలకు అందుబాటులో లేదు. కలుషితజలము త్రాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసలకోర్చి జలమును తెచ్చుకుం టున్న ప్రజలు ఎంతోమంది ఉన్నారు. ముఖ్యముగా రాయలసీమ దాహార్తిని ఏ ప్రభుత్వాలు కూడా తీర్చలేకపోయాయి. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా ప్రభుత్వాలు కల్పించవలసని కనీస నీటి వసతి నీటిపై వ్రాతలుగా మారిపోయినాయి. ప్రజలకు కనీస అవసరమైన జలమును అందించాలని కంకణం కట్టుకున్నారు భగవాన్ బాబా. ఆయన సంకల్పానికి కార్యరూపంగానే ఎన్నో ప్రాంతాలలో భగవాన్ బాబావారు అందించిన స్వచ్ఛమైన తియ్యని నీటిని ప్రజలు ఆస్వాదిస్తున్నారు.

– విద్వాన్ గోగినేని కనకయ్య

# జ్ఞాన విజ్ఞాన ఋషి విజ్ఞాన భాస్కరుడు

# సర్వేపల్లి రాధాకృష్ణ



ఒక్కపలచని విగ్రహం, స్వచ్ఛ ధవళమైన శిరోవేష్టనం, మోకాళ్ల వరకు దిగినటువంటి సిల్కుకోటు. తెలుగుదనం ఉట్టిపడే పంచకట్టు. దీర్ఘమైన నాసిక, సులోచనాల గుండా ప్రకాశించే తీక్షణమైన చూపు, జాలపాతం వలె నినదించే వాగ్ధార ఖంగు ఖంగుమని ధ్వనించింది. ఏ భారతీయుడు మరువలేని భారతీయతకు నిదర్శనంగా నిలిచారు. అటువంటి మహాపురుషుల పంక్తిలో ఒక విలక్షణమైన తేజస్సుతో, ప్రతిభతో భాసించిన మహామనిషి, రాధాకృష్ణ పండితుడు.

1888 మద్రాసు సమీపంగా ఉన్న తిరుత్తణిలో ఒక బీద బ్రాహ్మణ కుటుంబంలో జననం. వారసత్వంగా విద్యకాని, సంపదకాని ఆయనకు లభించలేదు. ఆ విషయం ఆయనే చెప్పారు. తిరుపతిలోనూ, నెల్లూరులోను, వెల్లూరులోను, మద్రాసులోనూ క్రైస్తవ మిషనరీ సంస్థలలో ఆయన విద్యాభ్యాసం జరిగింది. 1909లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో నెలకు నూరు రూపాయల జీవితం మీద నియమింపబడిన కొద్దికాలంలోనే తత్త్వశాస్త్ర విభాగానికి ప్రధానాచార్యుడయ్యారు. మైసూరు విశ్వవిద్యాలయంలో మూడేళ్ళు పనిచేసిన పిదప, అశుతోష్ ముఖర్జీ ఆయన అమోఘ ప్రతిభను గురించి కలకత్తా విశ్వవిద్యాలయంలో 1912లో మనస్తత్వ నైతిక శాస్త్ర విభాగానికి ప్రధానాచార్య పదవినిచ్చారు. రవీంద్రుని కవితావైభవం మీద ఆయన రచించిన గ్రంథం ప్రప్రథమంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 1927లో ప్రచురితమైన 'ఇండియన్ ఫిలాసఫీ' ఆయన కీర్తికి అద్దంపట్టింది. ఖండాంతర వ్యాప్తిని కలిగించింది. ఆక్స్‌ఫర్డ్ అప్టన్ ఉపన్యాసాలు, షికాగో నగరంలో హస్కెల్ ప్రసంగాలు, గౌతమబుద్ధునిపై ప్రసంగం ఆయన వాగ్విభూతికి పట్టం కట్టాయి.

డాక్టర్ సి.ఆర్. రెడ్డి పదవీ విరమణ అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులయ్యారు. అప్పట్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక వుండేది. డాక్టర్ రాధాకృష్ణన్ అంతకు పూర్వమే మద్రాసు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా పనిచేసిన బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడిగారిపై ఎన్నికల్లో గెలిచి 1931 మేలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి చేపట్టారు.

ఆ విశ్వవిద్యాలయాన్ని జాతీయస్థాయి విశ్వవిద్యాలయంగా, అంతర్జాతీయ ప్రసిద్ధిగాంచిన విశ్వవిద్యాలయాల స్థాయిలో రూపుదిద్దడంలో ఆయన ఎంతో అంకిత భావంతో, అవిశ్రాంతంగా కృషి నెరిపారు. వివిధ విద్యాశాఖలలో దేశ, విదేశాలలో లబ్ద ప్రతిష్టులు, ప్రతిభా సంపన్నులు అయిన వారిని ఆచార్యులుగా నియమించారు. అలా ఆయన ద్వారా నియమితులయినవారు భవిష్యత్తులో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావులుగా వాసికెక్కారు. ఇది ఆయన విశాల దృక్పథానికి తార్కాణం. అయితే గాంధీజీ, మదన్‌మోహన్ మాలవ్యాల ఆకాంక్షతో బెనారస్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి అలంకరించిన కాలంలో ఉన్నత విద్యపై ఆయన సమర్పించిన నివేదిక ఈనాటికీ శిరోధార్యమే. 'యునెస్కో' సంస్థ కార్యకలాపాలను తీర్చిదిద్దిన ఘనత రాధాకృష్ణన్‌కే లభిస్తుంది.

వివిధ దేశాలలో విద్వత్ సదస్సులలోనూ, పండిత పరిషత్తులలోనూ, విశ్వ విద్యాలయ ప్రాంగణాలలోనూ ఉపన్యసిస్తూ, తాత్వికాచార్యుడుగా, ఒక మహావక్తగా, బహుగ్రంథ కర్తగా ఆరు దశాబ్దాల జీవితం గడిపారు. యావత్ ప్రపంచంలో, ఏ విఖ్యాత శాస్త్రజ్ఞునికి, ఏ మహామేధావికి ఏ తాత్విక చింతాగ్రేసరునికి దక్కని అత్యంత అరుదైన గౌరవం డా. రాధాకృష్ణన్‌కు లభించింది.

రాధాకృష్ణ ప్రతిభా సంపన్నతా ఔన్నత్యంతో తాను తెలుగువాడననే స్ఫూర్తిని కల్గించకపోవడమొకటె బాధాకరం.

ఆయనను ప్రపంచ దేశాల్లో ప్రఖ్యాతి గాంచిన 152 విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం ఆయన ప్రజ్ఞ ధురీణతకు, ప్రతిభా విశేషాలకు, గణతకు, జగత్ విఖ్యాతికి జాజ్వాల్యమాన ప్రతీకలు.

ఆయన చివర వరకు రాధాకృష్ణన్ జ్ఞానయోగిగానే మనుగడ సాగించారు. అందలాలల కోసం అర్రులు చాచలేదు. అయినప్పటికీ స్వాతంత్ర్య సముపార్జనానంతరం ఉన్నత పదవులు ఆయనను వెదుక్కుంటూ వచ్చాయి. భారత రాజ్యాంగ సభ సభ్యునిగా, 1949లో రష్యాలో భారత రాయబారిగా నియమింపబడి, ఒక సాధారణ జ్ఞాన దూతగా ఆయనే రష్యా వెళ్ళారు. ఆయనను 1952లో భారతదేశ ఉపాధ్యక్ష పదవి, అనంతరం అధ్యక్షపదవినీ అలంకరించారు.

అధ్యక్షపదవి నిర్వహణ అవసరమైనప్పుడు ప్రభుత్వ విధానాలను నిశితంగా, తీవ్రంగా విమర్శించటానికి వెనుకాడలేదు. పేరుకుపోతున్న అవినీతిని, అసమర్థతనూ, లంచగొండితనాన్ని, జాతీయ వనరుల దుర్వినియోగాన్ని అభిశంసించడం జరిగింది. ఒక దశలో నెహ్రూకే హెచ్చరిక చేసారు. అధ్యక్షపదవి హుందాతనం నిలబెట్టారు. అధ్యక్షపదవి పొడిగింపునకు ఆరాటపడలేదు. 1967లో పదవి విరమణ చేసి ఆయన మద్రాసులో శేష జీవితాన్ని గడిపారు.


1975 ఏప్రిల్ 17న నిశాగగనంలో నక్షత్రరాశి అస్తమించినట్లు ప్రశాంతంగా కన్నుమూశారు. అయితే రవీంద్రుని గీతాంజలిపై ఆయనే చేసిన వ్యాఖ్యాన గ్రంథం రవీంద్రునికి నోబుల్ బహుమతి నందుకొనేట్టు చేసింది. ●

భగవంతునికి భక్తునికి
అనుసంధానమైనది


అంబికా దర్బార్‌బత్తి

# తెలుగువారి 'గురు'జాడ

## తెలుగు అక్షరశిల్ప సౌందర్యాన్ని సుస్సులభముగా పదాలతో తెలిపిన అక్షర బ్రహ్మ



అంధయుగం మీద ఉషస్సులా జ్వలించే శక్తిని అక్షరంలో నిక్షిప్తం చేసిన యుగపురుషుడాయన. సామాజిక వికృతిని ప్రతిబింబించే అద్దంలా మారే విద్యను అక్షరానికి నేర్పినవాడాయన. ఆయనే గురజాడ వేంకట అప్పారావు. మధురవాణి అనే వేశ్యారత్నం ఈ కలింగదేశంలో పుట్టకపోతే ఎంత లోపం జరిగేదో కదా! అంటాడు 'కన్యాశుల్కం' నాటకంలో కరటక శాస్త్రి. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ గురజాడ అనే మహారచయిత తెలుగు నాట పుట్టకపోతే ఆధునిక తెలుగు సాహిత్యంలో గొప్ప శూన్యం ఆవహించేది. గురజాడ (21.9.1862 – 30.11.1915) విశాఖ జిల్లాలోని యలమంచిలి వద్ద ఉన్న సర్వసిద్ధిరాయవరంలోపుట్టారు. తండ్రి వెంకటరామదాసు విజయనగరం సంస్థానంలో ఉద్యోగి. తల్లి కౌసల్యమ్మ. వెంకటరామదాసు ఉద్యోగరీత్యా చీపురుపల్లిలో ఉన్నందున అప్పారావు ప్రాథమిక విద్య అక్కడే పూర్తయింది. వ్యవహారిక భాషా నినాదానికి పదునుపెట్టి, తరువాత కాలంలో భాషామతల్లిని కాపాడిన గిడుగు రామ్మూర్తి పంతులు అక్కడే అప్పరావుగారి సహాధ్యాయి. తరువాత ఎంఆర్. కాలేజీ (విజయనగరం)లో చదువుతున్నప్పుడు నాటి ప్రిన్సిపాల్ సి. చంద్రశేఖర శాస్త్రి ప్రోత్సాహం లభించింది. సోదరుడు శ్యామలరావుతో కలిసి తొలి రోజులలో అప్పారావుగాగారు రచనలు చేసేవారు. ముఖ్యంగా కవిత్వం సోదరులు ఇద్దరూ కలిసి రాసేవారు. తరువాత విజయనగరం విద్యా సంస్థలలో ఇంగ్లీష్ బోధకునిగా, పురాతన శాసనాల పరిష్కర్తగా పనిచేశారు. ఆ క్రమంలోనే విజయనగర సంస్థానం పరిస్థితులను అధ్యయనం చేశారు. ఆ అధ్యయనం ఫలితమే 'కన్యాశుల్కం' నాటకం.

1892లో (సవరణలతో 1909లో మళ్లీ వెలువరించారు) అప్పారావుగారు కన్యాశుల్కం నాటకం రాశారు. దాదాపు నూట ఎనిమిది సంవత్సరాల తరువాత ఇప్పటికీ ఆ నాటకం సరసన నిలబడగలిగిన నాటకం తెలుగులో రాలేదంటే అతిశయోక్తి కాదు. 19వ శతాబ్దానికి విజయనగరం సంస్థానంలో అగ్రవర్ణం సామాజిక పరిస్థితి ఏ విధంగా ఉన్నదో కళ్లకు కడుతుంది. కన్యాశుల్కం, డబ్బు ఇచ్చి బాలికలను పెళ్ళి చేసుకోవడం ఇందులో ప్రధాన వస్తువు. వేశ్యా సంపర్కం, విధవాపునర్ వివాహం సమస్యలు ఇందులో సమాంతరంగా చర్చకు వస్తాయి. నాటకంలోని చాలా అంశాలు ఇప్పుడు సమాజంలో కనిపించకపోవచ్చు. కానీ గురజాడ ఆవిష్కరించిన సాహితీ విలువలు నేటికీ మార్గదర్శకంగానే ఉన్నాయి. పలు సంభాషనాల శకలాల నిత్యసత్యాల వలె వెలుగొందుతున్నాయి. 'ఒపీనియన్స్' అప్పుడప్పుడూ ఛేంజ్ చేసుకోకపోతే పొలిటీషన్ కానేరడోయ్" మనం చేస్తే లౌక్యం, అవతలి వాళ్లు చేస్తే మోసం' 'ఆత్మానుభవం అయితే తప్ప తత్వం బోధపడదు' 'దబాయించడమే కదా పోలీసు డ్యూటీ' వంటి ఉల్లేఖనలు ఇప్పటికీ తెలుగువారి నాల్కల మీద నర్తిస్తూనే ఉన్నాయి. "పెళ్ళిల్లో చూపించే ఒక్క జాతకమూ నిజంకాదు' అంటుంది ఒక పాత్ర. ఈ నాటకం వందేళ్ల క్రితం రాసినది. కానీ ఆ మాట నేటికీ వర్తిస్తుందంటే అంగీకరించేవారే ఎక్కువ. మధురవాణి గురజాడ మహాకవి సృష్టించిన అద్భుత పాత్ర. ఈ పాత్ర తరువాత ఎన్నో స్త్రీ పాత్రలకు జన్మనిచ్చింది. మూఢ నమ్మకాల మీద గురజాడ సంధించిన వ్యంగ్య బాణాలు అపూర్వం, అద్భుతం. ఇంగ్లీష్ చదువుమీద ఆనాటి సమాజంలో ఉన్న వ్యామోహం ఎలాంటిదో గిరీశం, ఆయన ప్రియశిష్యుడు వెంకటేశం మధ్య జరిగే సంభాషణ ద్వారా గురజాడవారు రమణీయంగా చిత్రించారు. మధ్య మధ్య ఇంగ్లీష్ ముక్కలను మెరిపిస్తూ గిరీశం దిగ్రేట్ పలికే సంభాషణలు మరిచిపోవడం సాధ్యంకాదు. దెయ్యాల భయం మీద, వాటిని పట్టి సీసాలలో బంధించడం మీద గురజాడ ఈ నాటకంలో పొందుపరచిన దృశ్యాలు, నభూతో నభవిష్యతి. లేని దెయ్యాన్ని పూజారి గవరయ్య సీసాలో బంధించడం అనే సన్నివేశంతో ఆయన సమాజంలోఉండే డొల్లతనం నిజరూపాన్ని ఆవిష్కరించారు. గిరీశం, మధురవాణి, రామప్ప పంతులు, అగ్నిహోత్రావధానులు, లుబ్ధావధానులు, కరటకుడు, బుచ్చమ్మ, మీనాక్షి, పూటకూళ్లమ్మ, పూజారి గవరయ్య, సౌజన్యారావు– చిరంజీవులుగా నిలిచిపోయే పాత్రలు. స్త్రీ జాతి చరిత్రను తిరగరాస్తుంది' అన్న అచంచల విశ్వాసానికి తగ్గట్టుగా గురజాడ తన స్త్రీ పాత్రలను చిత్రించారు. మధురవాణి, బుచ్చమ్మ, మీనాక్షి, పూటకూళ్లమ్మ– ఏ పాత్రను చూసినా వాటి పట్ల గొప్ప సానుభూతి కనపరుస్తారు.

కథకునిగా కూడా గురజాడ సమున్నత శిఖరాలను అధిరోహించారు. 'మీ పేరేమిటి?' 'దిద్దుబాటు', 'పెద్దమసీదు', 'సంస్కర్త హృదయం' వంటి కొన్నికథలే రాసినా అవి ఆధునిక కథకు నమూనాలుగా భాసిల్లాయి. దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులు చేసిన దేవుళ్లారా మీ పేరేమి?' అంటూ మొదలయ్యే 'మీ పేరేమిటి' కథ మతంలోని వికారాలను వర్ణిస్తుంది. ముసలి భర్తతో వేగుతున్న భార్య కథ మెటిల్డా. సంస్కర్త హృదయం కథను పూర్తిచేశాక, ఆ కథలోని సరళ పాత్ర ప్రభావం నుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యం. 'దేశమంటే మట్టికాదోయ్! దేశమంటే మనుషులోయ్' అని నినదించినవాడు గురజాడ. దేశభక్తికి ఆయన చెప్పిన ఈ నిర్వచనం నాటికీ నేటికీ వేదమంత్రం వలె మోగుతున్నది. బాల్యవివాహాన్ని విషాదాన్ని కళ్లకు కడుతూ ఆయన కలం నుంచి వెలువడిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ గేయం ప్రతి హృదయాన్ని గాయపరుస్తుంది. కన్యక, లవణరాజు కల ఆయన ఇతర కవితా ఖండికలు. ఈ కవిత ఖండికల కోసం ఆయన సృష్టించిన ఛందస్సు ముత్యాలసరం. గురజాడ అనగానే కన్యాశుల్కం నాటకమేనా? ముత్యాల సరాలు జ్ఞాపకం రావాలి. తిక్కన, వేమన, గురజాడ, ఆధునిక సాహిత్యంలో కవిత్రయం అంటారు శ్రీశ్రీ. ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ ఆధిక్యానికి కారణాలను శ్రీశ్రీ గొప్పగా ఆవిష్కరించారు. మొత్తంగా తెలుగుసాహిత్యం మీద గురజాడ అడుగుజాడే ఉన్నదంటారు. ఆయన సౌందర్య దృష్టి విశిష్టమైనది. హాస్యరచనలో, వ్యంగ్య ధోరణిలో ఆయన పెట్టిన ఒరవడి తెలుగు సాహిత్యంలో కొనసాగలేదని చెప్పడం గర్హనీయం.. ●

## నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న
# ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తి!
## -75 సంవత్సరాల న్యాయవాది అనుభవం ఉన్నది-

మీ జీవిత రహస్యమేంటి- ఈ వయసులో కూడా ఇన్ని మైళ్ళు కాలినడకనే వస్తున్నారూ- అని 14 మైళ్లు (కిలోమీటర్లు కావు) భీమవరం నుంచీ గణపవరం నుంచీ నడిచి వచ్చిన మా నాన్న గోటేటి విస్సం రాజుగారినో (మా నాన్నగారు డాక్టర్ లెండి) ఓసాటి వైద్యుడడిగారు. భీమవరం నుంచి బయల్దేరుటకు ఓ గంట ముందే వరిధనం (పాలకొల్లు ప్రక్క ఊరు) 15 మైళ్ళు నడిచి, భీమవరంలో ఓ మిత్రుని ఇంటి వద్ద ఆగారు. అప్పు డాయన చెప్పినమాట- సూర్యోదయత్పూర్వమే నూతివద్ద స్నానము, 9 గంటలకు గాయత్రి జపం, 10కి భోజనం చేసి, తిరిగి రాత్రి 7 గం॥లకు భోజనం అన్నారు.

ఈ స్వకపోతానికి కారణం- ఈ మధ్య విన్న ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తిగారి నూరవ జన్మ దినం, న్యాయవాదిగా ఆయన పూర్తి చేసుకున్న 75 సం॥ల న్యాయవాది జీవితం.

సర్వసాధారణంగా న్యాయవాది అబద్ధం ఆడ కుండా జీవితం సాగించలేడు. కానీ ఆనాడు న్యాయవాదులైన టంగుటూరి ప్రకాశం పంతులు, పాకాల వెంకట రాజమన్నార్, కోకా వెంకట సుబ్బా రావుగారలు అబద్ధాలు ఆడకుండా న్యాయవాద వృత్తికి విలువతెచ్చారు. ప్రకాశం గారు కేసు వాదిస్తు న్నారంటే - తెల్లదొరలైన న్యాయమూర్తు (జడ్జీ)లు కళ్ళు తెరచి, చెవులు రిక్కించి వాదనలను వినేవారు. సమయపాలనం చేసేవారు.



అలాటి పవిత్ర న్యాయవాద వృత్తిని అకళకంగా నిర్వర్తించిన ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తి అంటే నాకెంతో గౌరవం కలిగింది. వారిది న్యాయవాదుల వంశం. 20 మంది పూర్వులు న్యాయవాదులుగా పనిచేసారు. వారి తండ్రిగారు న్యాయవాదిగా మంచిపేరు సంపాదించారు. తండ్రిబాటలోనే గోపాల కృష్ణమూర్తి కూడా న్యాయవాది వృత్తి నెన్నుకోవడానికి కారణమైంది.

మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో బి.ఎస్.సి. పట్టా అందుకుని మద్రాసు 'లా' కాలేజీలో బి.యల్. పట్టానందుకున్నారు. 1936 సం॥ములోనే మద్రాసులో న్యాయవాది వృత్తిని ప్రారంభించారు. ఆంధ్రరాష్ట్రం సిద్ధించి, గుంటూరులో హైకోర్టు ప్రారంభించిన తరువాత గుంటూరులో న్యాయవాదిగా ప్రసిద్ధిగాంచారు. ఆంధ్రప్రదేశ్ అవతరణంతో హైదరాబాద్‌లో హైకోర్టు స్థిరమైంది., మరలా గోపాలకృష్ణమూర్తిగారు 'కాము'గా 'మకాము' హైదరాబాద్‌కు మార్చారు. అదే ఆయనకు స్థిరనివాస మయింది. బార్ కౌన్సిలు సభ్యులైన తరువాత ఆయన కీర్తి ప్రతిష్టలు విస్తరించాయి. పరిచయాలు పెరిగాయ్. నేస్తాలు పెరిగాయ్. చాలామంది ఆయన్ను 'వకీలు'గా నెన్నుకునేవారు. సత్యనిబద్ధమైన మార్గంలో, తమ పూర్వులు నడిచిన బాటలో నడవడం ఆయనకు మెరుగైన జీవితమైంది.

డబ్బుమీద ఆశతో ఏ కేసు పడితే ఆ కేసును చేబట్టరనే పేరు వచ్చింది. నైతికంగా ఆ కేసు ధర్మబద్ధమైన దనుకున్నప్పుడే వాదించేవారు. ఆయన వాదించిన కేసులకన్నీ విజయములే. విడాకుల వంటి కేసును దరి చేరనిచ్చేవారు కాదు. కేసులు పొడిగింపచేయడం పట్ల ఆయన విముఖత చూపేవారు. కేసుల్ను వాదించేవారి వద్దకానీ, తీసుకువచ్చే క్లయింట్స్ వద్దగానీ ఓ కప్పు కాఫీని కూడా త్రాగేవారు కారని విని- ఆయన చిత్తశుద్ధికి అంజలి ఘటిస్తున్నాను. ఎందరో న్యాయమూర్తులు ఆయన ముందే పదవీ విరమణం చేసారు.

ఆయన చెప్పిన కొన్ని మాటలు ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటాయ్. ఆ రోజుల్లో హిమయత్ నగర్‌లో ఆయన హైకోర్టుకు రిక్షాలోనే వెళ్ళేవారట. ఎనిమిది అణాలు (అర్ధరూపాయి) యిస్తే వాడెంతో సంతోషమందేవాడట. బషీర్‌బాగ్ నుంచి మూడే మూడు రూపాయలకు టాక్సీలో వెళ్ళేవారట. 1958 సం॥ములో 75 రూపాయలు చెల్లించిన ఇంటిఫోనే ఇప్పటికీ వాడుకలో ఉన్నదంటారు.

కోర్టులు పెరిగినందున సమస్యలు త్వరగా తీరిపోవు. న్యాయవ్యవస్థ దిగజారిం దనడం నిజం కాదు. అవినీతి ప్రతీ రంగంములోనూ ఉన్నది. అది న్యాయశాఖకు కొంత బదిలీ చెంది ఉండవచ్చు. కానీ పూర్తి న్యాయవ్యవస్థ చెడిపోలేదంటారు.

చాలామంది చోద్యంగా నన్నుడుగుతుంటారు. నూరు సంవత్సరాలు వచ్చినా నిండు ఆరోగ్యంగా ఉన్నారు. రహస్యమేంటి అని? కొత్త రహస్యమేమీ లేదు. ఉదయం ఐదింటికే లేచి కాలకృత్యాలు తీర్చుకుని కాలినడకతో దిన కృత్యం ప్రారంభమవుతుంది. శుభ్రంగా రెండు పూటలా, ఇంట్లో మృష్టాన్నభోజనం చేస్తాను. నెయ్యిలేనిదే నోట్లోకి ముద్ద దిగదు. శాఖాహారిని. నూనెలోని రొట్లు, మొలకలెత్తిన పప్పులూ తినాలనే నియమం లేదు. స్వీట్లు బాగా తింటాను. మధు మేహం (షుగర్) రక్తపోటు (బి.పి.) కానీ లేవు. సాధారణంగా బయట భోజనం చేయను. ఎప్పుడో కానీ ఆ అవసరం ఉండదు. కోర్టు యింటిల తరువాతనే - ఏదైనా? రాత్రి 10 గం॥లయ్యేసరికి నిదురపోవలసిందే! ఇవే ఆయన ఆరోగ్య నియ మాలు!

అందరు మహనీయులు పుట్టిన తెనాలిలోనే ఆయన జన్మించారు. 1912 సం॥ము పుట్టిన రెండవ రోజున అనగా 1912 సం॥ము జనవరి 2న ఎల్లమరాజు గోపాలకృష్ణమూర్తి పుట్టారు. వారి తండ్రిగారు న్యాయవాదియని ముందే వ్రాసాను. ఆయన తెనాలి బజారులో నల్లకోటు వేసుకుని నడుస్తుంటే అంగళ్ళలోనివారు, ఇళ్ళమీద అరుగుల మీద కూర్చున్నవారు లేచి నుంచునేవారు. ఇప్పు డలాటి గౌరవమెక్కడ ఉన్నది? మంచి కొడిగట్టి పోయింది.

ఈ శతవత్సర న్యాయ సంపన్న కుటుంబీకుడు నిండు నూట ఇరవైయేండ్లు ఆరోగ్యంతో వర్ధిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. - గోటేటి

## సంస్కృతంలోని రూప్యా నుంచీ రుపాయి పేరొచ్చింది!

'రూపాయి' అనేది ఆంగ్ల పదం కానేకాదు. ఆంగ్ల భాష అనేక సంస్కృత పదాలను తనలో ఒదిగింపచేసుకుంది. 1542వ సంవత్సరంలో 'రూపియా' నాణెమును విడుదల చేయడం జరిగింది. మొదట విడుదలైన రూప్యా నాణెం ఒక తులం బరువు ఉండేది. అంటే 180 ధాన్యపు గింజల ఎత్తుకు సమానం. 175 గులువు గింజల బరువులో, స్వచ్ఛమైన వెండితో తయారు కాబడి ఉండేది. నా ఊహ తెలిసిన తరువాత కూడా ఒక పాత వెండి రూపాయి నాణెమునిస్తే- రెండు మూడింతలు డబ్బును యిచ్చేవారు.


మొదటి రూపాయి నాణెంపై బ్రిటిషువారి కాలంలో One Rupee అనే ఆంగ్ల అక్షరాలు, దాని క్రింద ఒక రూపాయి అనే తెలుగు అక్షరాలే ఉండేవి. స్వతంత్రం వచ్చిన తరువాత, మనదరిద్రానికి దాఖలాగా, సత్తురూపాయలూ, నాణెములు వచ్చాయి. గాలికెగిరిపోయే నాణెములూ పావలా, అర్ధరూపాయి, పరిమాణంలో రూపాయి బిళ్ళలు వస్తున్నాయి. నిరక్షరాస్యులకు ఏ నాణెం ఏ విలువగలదో తెలియకుండా పోయింది.

# కాంతమ్మ ఎవరు తాతయ్యా! నాకూ అడగాలనే వుంది!

## -నేను ఆయన్ను తెలుసుకోవాలనుకొనేసరికి ఆయన చనిపోయారు-

ఆయనెవరో కాదు 'కాంతం కథలు' సొత్తయిన మునిమాణిక్యం నరసింహారావుగారు. ఆకాశవాణిలో ఆయన చాలా కాలం పనిచేసేవారు.

మునిమాణిక్యం వారికీ నాకూ సాపత్యంమేఁమంటే- మా యిద్దరివద్దా కుప్పలు కుప్పలుగా పెన్నులు (ఇప్పుడు బాల్ పెన్నులూ- జెల్ పెన్నులూ అనుకోండి) ఆయన రోజుకో పెన్ను కొనుక్కుని వెళ్ళేవారు- ఎక్కడో మరచిపోయి మరో రోజో పెన్ను కొనేవారు. ఒకసారి- అనుకుంటాను- 'ఇవిగోండి మునిమాణిక్యం గారూ- మీరు విడిచిన పెన్నులివిఁవిగో అంటూ ఓ పెద్దకుప్పగా పెన్నులు పోగు పోసారు.



ఆయన మరచిపోయి రోజుకో పెన్ను కొనేవారు, నేను మనసుపడి రోజుకో పెన్ను చేరుస్తాను.

కాంతంపైనే యెక్కువగా ఆయన మనసు కథలు సాగేవి. ఆ కాంతం ఎవరో తెలుసుకోవాలనే ఉత్సుకత మీకు ఉందా? నాకూ ఎంతో కాలంగా ఉండేది. ఇదే ఉత్సుకతను వారి మనుమరాలుకూ ఉండేది. ఓసారి తాతయ్య చెప్పిన కథలను వ్రాస్తూ- "కాంతం ఎవరు తాతయ్యా? మా నాన్నమ్మ శేషగిరి అమ్మా? లేక యిప్పు డున్న రాజ్యలక్ష్మి నాయనమ్మా? అని అడిగింది.- అంటే వారి మనుమరాలికే 'కాంతం' తెలియ దన్నమాట.

'ఓసినీ బంగారం కానూ! అని మనుమరాలి వీపును స్పృశించి- భలేగా అడిగావే- ఈ నాయనమ్మా కాదు, ఆ నాయనమ్మా కాదే! అనగానే ఆ మనుమరాలు సమాధానం ఎదురుచూడడం చూచి, ఉత్తమ లక్షణాలు కల కాంతిపుంజంలా వుండే నా ఊహా గృహిణి అన్నారు తాతయ్య.

మునిమాణిక్యం నరసింహారావుగారు ఛలోక్తులు రువ్వే రచయిత. అప్పట్లో చిలకమర్తివారు, పానుగంటివారు నోరివారు, మునిమాణిక్యం వారినీ- వెరశి ఐదుగుర్నీ పంచ సింహాలనేవారు. భీకరత్వంలో కాదు సుమండీ- సున్నిత హాస్యాన్ని




పండించడంలో సుమండీ. మొక్కపాటి, భమిడిపాటి వారు హాస్యబ్రహ్మలుగా ఉండేవారు. కానీ వారి హాస్యలాస్యాలను చాలామంది మరచిపోయారు. హాస్యబ్రహ్మ- ఎవరురా అంటే జంధ్యాల అనేవారు. ఆయన్నూ మరచి ఆయన పరిచయం చేసిన బ్రహ్మానందంగారిని హాస్య రస సామ్రాట్ అంటున్నారు. తరాలు మారినకొద్దీ, కొన్ని తరాలవారిని మరచిపోవడం జననైజం.

మునిమాణిక్యం వారిని ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే మొన్న మొన్నటివరకూ 1973 ఫిబ్రవరి వరకూ ఆయన ఉన్నారు. **'భార్యను లొంగదీసుకోవడం ఎలా'** పుస్తకం మునిమాణిక్యం కథలూ చదివినవారికి ఆయన మన మనసుల్లో ఉండనే ఉంటారు.

అయితే ఒకటండోయ్ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, సారస్వతపరిషత్తు, సాహిత్య అకాడమీ లాంటి ఎన్నో సంస్థలు ఆయన్ను గౌరవించాయ్. సినిమా రంగంల జోలికి ఆయన పోలేదు. ఆయన జోలికి సినిమారంగం రాలేదో తెలియదుగానీ, ఆయన్ను ఆకాశవాణి రంగం పాదాలకు పారాణి పూసుకున్నంత చక్కగా పూసుకుంది. ఇంతకూ వారి సతీమణి పేరు చెప్పకపోతే 'కాంతం' అనే పేరు పొరబడతారని చెబుతున్నా ఆమె పేరు రాజ్యలక్ష్మి. ఈ సమాచారం అందించిన శేషకుమారి ఆయన మనుమరాలు. ●

## రెండు పదుల తెలుగు వెలుగు కళాప్రపూర్ణ గోపీ శుభాశీస్సులు

ఒక వ్యక్తి జీవితంలో 20 యేళ్లు పెద్ద వయస్సు కాదుగాని, ఒక పత్రిక జీవితంలో మాత్రం సుదీర్ఘమైన కాలం. ప్రధాన తెలుగు ప్రాంతాలకి దూరంగా ఉంటూ సకల తెలుగుజనావళిని తనవైపు ఆకర్షిస్తూ, తెలుగువారి సాంస్కృతిక, సామాజిక జీవితానికి దేశవిదేశాల్లో మార్గదర్శనం చేస్తూ, నిత్యచైతన్యశీలిగా వెలుగుతున్న శ్రీ గోటేటివారికే ఇది సాధ్యం!

82 యేళ్ల వయస్సులో కూడా అవిశ్రాంత అక్షర తపస్సు చేస్తూ అలనాటి వైభవమూర్తులను ఆత్మీయంగా తలచుకుంటూ, వర్తమానతరానికి స్ఫూర్తి నందిస్తున్న మహానుభావుడు శ్రీ గోటేటి శ్రీరామారావు. ఆయనే ఒక ప్రముఖాంధ్రుడు! పత్రిక తెరవగానే తెలుగు పరిమళాలు గుప్పుమంటాయి. ఇంకా 'ప్రముఖాంధ్ర' రాలేదే అని ఎదురుచూస్తాము. హైదరాబాద్‌లోని మా యింటిలో శ్రీగోటేటి అడుగుపెట్టడం ఓ తీపిగుర్తు. మా కుటుంబ సభ్యులను ఆశీర్వదించడం ఓ మధురస్మృతి. నా షష్టిపూర్తి సందర్భంగా 'ప్రముఖాంధ్ర'లో ప్రచురించిన వ్యాసం నాకు అనర్ఘమైన ఆశీస్సు.

'ప్రముఖాంధ్ర'కు రెండు పదులు నిండిన సందర్భంగా శ్రీగోటేటివారికి నా నమోవాకాలు.

-డా॥ ఎన్. గోపి, హైదరాబాదు

## మలేషియా అభిమాని అభినందన లేఖ

**నా ప్రియాతి ప్రియమగు శ్రీశ్రీ ప్రముఖాంధ్రుడు గోటేటి శ్రీరామారావుగారికి శతకోటి ప్రణామములు!**

మీరు ప్రేమతో వ్రాసిన ఉత్తరము కొన్ని దినములకు ముందు అందినది. చదువుకొని చాలా సంతోషించితిని. కాని వెనువెంటనే జవాబు వ్రాయలేక పోయినందుకు విచారపడుచున్నాను; క్షమాపణ కోరుతున్నాను! క్షమించండి!

ఇప్పుడు నాకు 86 సంవత్సరముల వయస్సు. తెలుగుతల్లి ఆశీర్వాదముతో సహా మీలాంటి ప్రముఖాంధ్రుల ఆశీర్వాదల వలన బ్రతికియున్నాను. మీ ఆశీస్సుల ఫలితంగా మరికొంత కాలం బ్రతికి ఉంటానని నమ్ముతున్నాను; అంతా దేవుని దయ!

"తెలుగుతల్లి' 112వ సంచిక దీపావళి సమయంలోనే వెలువడుతుంది. అందులో మన ప్రముఖాంధ్ర చందాదారులను ప్రోత్సహించుటకు వివరణలు వ్రాయాలనుకుంటున్నాను. ఇక సెలవు.

ఇట్లు మీ తెలుగు సోదరుడు
**మదిని సోమనాయుడు**

ఆరోగ్యం తక్కువగా ఉన్నందున బాధపడకండి. మీరు 120 సంవత్సరములు నిండు జీవితంగా జీవించాలని పరమాత్ముని ప్రార్థిస్తున్నాను.

# అనంత కాలం అంటాం! కాలం విలువనెరుగం!!
# ఆదిఅంతముల్లేని కాలగర్భాన్ని చీల్చుకుని వచ్చాం!!

ఆత్మగౌరవాన్ని అదుపులోకి తీసుకుని వచ్చామా?. వచ్చిన మనం మాయా కల్పితమైన దేశకాల చిత్రీకృత వైచిత్రంలో సమదృష్టితో వ్యవహరిస్తున్నామనీ అనలేం! ద్వంద్వ దృష్టీభూతులమనీ చెప్పలేం. మన ప్రాచీనుల మార్గదర్శనంలో నడుస్తున్నామా? అదీ లేదు. సంతోషమందుతున్నామా? దౌఖితులమవుతున్నామా? అదీ తెలియదు.

ఒకతరి సంతోషం. వేరొకతరి దుఃఖం. మరియొకసుఖం. ఇంకొక తరి కష్టం. ఎలుగెత్తి ఏమన్నా ప్రయోజనమా? అది కంఠశోషేయవుతుంది.

భవితనుంచి గతంలోకీ వర్తమానంలోకీ కాల ప్రవాహవేగం యెలా ఉందని కూడా తర్కించుకోము. తర్కించుకునే సమయమూ ఉండదు. నవనాగరికం నాజూకుకదా అని అనుకుందామంటే అందుబూజు పట్టిన భావాలు రుగ్మతలై కూర్చుంటున్నాయ్. పాత చెట్లకు క్రొత్త చివుళ్ళు పూస్తున్నాయేగాని మనిషి ఊసుల్లో, ఊహల్లో, ఉద్యమాల్లో వృద్ధి వినాశనం, క్షామం– కామం, విప్లవం– విశ్వశాంతి చిన్న కుటుంబం– ఏడంతస్తుల ఆవాసం– ఇవే తక్క, వేరు ఆలోచనలు వుండవు.

**వేర్పాటు ధోరణి, విభజనా ధోరణిలే ధరణియందు విరబూస్తున్నవి.**

అనంతమైనదీ, ఐశ్వర్యవంతమైనదీ భూతకాలమనీ, విశేషమైనది భవిష్యత్కాలమనే ఆశాభావం కలగడం లేదు. వర్తమాన కాలం స్వార్థపూరిత వ్యర్థమైనదని నిరాశ, నిస్పృహలు పడుతూ, నిందారోపణలు చేసుకుంటూ ఉంటే సుఖం వచ్చి ఒడిలో కూర్చుంటుందా? **దైవ రూపంబు కాలంబు దానికెపుడు లోటు కలుగదు మన బుద్ధి లోపంబుగాని–** యని పానుగంటివారు చెప్పినట్లు– మనం మంచిగా మసలుతూ కాలంబు మహనీయమైనదని– అది దైవరూపంబనే పవిత్రభావన మనలో కలిగిననాడు అంతటా, అంతఃకరణలోనూ మంచే కలుగుతుంది కానీ ఆ 'మంచి' సుదూరమయ్యింది. చదువులందుగానీ, సభలయందుగానీ కనబడడం లేదు. దొందూదొందేయన్న మనుజభవులు ప్రభువులువుతున్నారనా– రామవిభుడు పుట్టి రఘు కులంబలరించె కురు విభుడు పుట్టి కులము చెరిచె– అని వేమన కవి చెప్పిన పద్యములోని పై రెండు పాదముల భావమే యీనాడు నాడు నాడంతా ప్రభవిస్తున్నది.

రామచంద్రుడూ ప్రభువే! కురువంశసార్వభౌముడైన దుర్యోధనుడూ ప్రభువే! రామరాజ్యాన్నే అందరూ ధర్మరాజ్యం అన్నారు. ఆ రామరాజ్యాన్నే ఆదర్శంగా చేసుకుని ప్రజాస్వామ్యం పుట్టింది. అంతేకాని కురుసార్వభౌముడైన దుర్యోధను న్నెవరూ ఆదర్శంగా తీసుకోలేదు. విశ్వంలోని పలుదేశాలవారు రామాయణమును తమ భాషల్లో అనువదించుకొని, ఆదరించడమే కాకుండా, ఆదర్శ రాజ్యాంగాన్ని రచించుకున్నారు. భారతరాజ్యాంగం కూడా శ్రీరాముని ఆదర్శ రామరాజ్యాంగమే. బౌద్ధమతం స్వీకరించిన అంబేత్కర్, మక్కాలో జన్మించి మన దేశ పౌరసత్వం స్వీకరించి, కేంద్ర ప్రభుత్వంలో తొలి విద్యామంత్రియైన మౌలానా అబుల్‌కలాం ఆజాద్ నుంచీ– నేటి పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వరకూఅదే బాటలో నడవాలన్నారు. పాకిస్థాన్‌లో ఉండే సరిహద్దుగాంధీగా పిలువబడిన ప్రముఖ నాయకుడు ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్ అదే బాటను అనుసరించారు. ఆఫ్రికా నాయకుడు నెల్సన్ మండేలా కూడా అదే బాటలో నడిచారు. అమెరికాలోని మార్టిన్ లూథర్ కింగ్, అబ్రహాం లింకన్ ఆ బాటలోనే పయనించారు. పేరుకు గాంధీ మార్గమూ, గాంధీపుట్టిన దేశమే, నెహ్రూగానీ ఎవరూ సత్య అహింసల మార్గాన్ని అనుసరించలేదు.

కాంగ్రెస్ పార్టీ మూలకర్త తెల్లవారి బిడ్డ అనీబిసెంట్ ధర్మమార్గాన్ని ఎవరు నడిచారు. గాంధీ వంశీయులెవరూ రాజకీయంలోకి రానూలేదు. వచ్చినవారు గాంధేయులు కాదు.

గాంధీ వంశజుడు గాకపోయినా రాజీవ్‌గాంధీ మెరుగనిపించాడు. భారతదేశాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేయాలనెడి తపన పడ్డాడు. ఇతరగాంధీల్లో ఏ కోశాన చూచినా– ఏ గాంధీతత్వమూ లేదు. పి.వి. నరసింహారావు కాంగ్రెస్ పరపతి నిలిపినా ఆయన్ను సూదిలో నున్న దారాన్ని తీసినట్టు తీసిపారేశారు.

ఇలా జరుగుతుందని, మహాత్మాగాంధీ ముందే ఊహించి, స్వాతంత్ర్య సమర విజయ శంఖం ఊదిన కాంగ్రెస్ అధికార పీఠం అధిష్ఠించవలదన్నారు.

పట్టాభి సీతారామయ్య నుంచీ, నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి వరకూ ఆత్మగౌరవం కోసం పాకులాడిన ప్రకాశం పంతులు గారిలా, సర్వస్వమూ త్యాగం చేసిన వారేరి? కామరాజులా నిరాడంబరంగా జీవించిన వారేరి? అంటే సమాధానం రాదు– కావున ఆత్మగౌరవం సర్దుకుపోవాలి! ●

## మతతత్వమూ కాదు మతమౌఢ్యమూ కాదు!
## మోడీ ఢీకొన్నది అధర్మపాలనము నే!

**–మానవత్వంలోని మంచితనం కళ్లు తెరిపించిన 'మోడీ' కంచుగళానికి జేజేలు!!–**



భారతమాత కరుణించింది! భారతీయత అంటే సర్వమానవ సమానత! సర్వజనావళీ శాంతియుతంగా బ్రతకాలి! ఒకరికొకరు చేయూతనివ్వాలి. పరస్పరం సహకరించు కుంటున్నపుడే ద్వేషవైషమ్యాలు తొలగి పోతాయి. అపోహలకు ఆస్కారమివ్వ కుంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ఎవరి ధర్మాలను వారు పాటించడమే ధర్మం. ఎవరి పనులను వారు చేసుకుంటేనే సత్యం నిలుస్తుంది. సత్య ధర్మాలెక్కడ ఉంటాయో అక్కడే శాంతి వర్ధిల్లుతుంది.

ఏదీ శాంతీ ఎక్కడ శాంతీ! ఎప్పుడు మనకూ శాంతీయని సినిమా పాటలు పాడుకుంటూంటే శాంతి సిద్ధించదు. ధర్మం వర్ధిల్లదు. గాంధీ ప్రబోధించిన గ్రామరాజ్యం, రామరాజ్యం అన్న పదాలను గాంధీ పేరుపెట్టుకున్నవారే తుంగ లోకి త్రొక్కేసారు. సాక్షాత్తు గాంధీగారే త్రొక్కారు. శాన్తి శాన్తి అంటూ సత్యా గ్రహాలతో హాలాహలం సృష్టించారు. ఆయన సృష్టించినది హాలాహలమని రవీంద్రకవీంద్రుడు చెప్పేవరకు గాంధీ గ్రహించలేదు. గాంధీగారు కోరిన గ్రామరాజ్యమేర్పడిందా– అంటే – అదీ ఏర్పడలేదు. ఇప్పుడున్న ప్రజాస్వామ్య ప్రభుత్వానికీ పొరుగుదేశాల్లో, తూర్పు పశ్చిమదేశాల్లో భారతీయత కోసం పాటుపడుతున్న ప్రధానికి వెన్నెముకగా నిలుద్దాం, వెన్నుతట్టి ప్రోత్సహిద్దాం.

ఎన్నికల పోటీవరకూ పార్టీలూ, విభేదాలూ, విభాగాలే కానీ– ఎన్నికయిన తరువాత అందరూ ఏకదేశం, ఏక దేశస్థులందాం. ఆ నినాదం సీమాంధ్ర– తెలంగాణల్నుంచే ప్రారంభిద్దాం.

ఒక దేశం– ఒకే కులం– ఒకే స్వరం ఇంతకన్నా 'ఓకే'లు ఏముంటాయ్.


*If you want Comfortable Stay - Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# భార్యాభర్తలు ఇద్దరూ పనిచేసారు! ఒక్క జీతమే తీసుకున్నారు! మన దుర్గాబాయమ్మ! దేశ్‌ముఖ్‌లు!!



దుర్గాబాయమ్మను తలువని తెలుగువాడు దౌర్భాగ్యుడు. ఆమె గోదావరి జిల్లాలోని రాజమండ్రిలో 1909 జూలై 15న కృష్ణవేణి, రామారావు దంపతులకు జన్మించింది. అయితే దుర్గాబాయ్- దేశ్‌ముఖ్ దంపతులిరువురూ పనిచేసి ఒక వేతనాన్నే తీసుకున్న దంపతులూ వీరొకరే!

ఆమె చిన్నప్పట్నుంచీ ధీరోదాత్తురాలే. బాల్యంలోనే కాంగ్రెస్ వలంటీరయింది. కాకినాడలో అఖిల భారత కాంగ్రెసు మహా సభలు జరిగినప్పుడు ప్రవేశపత్రం లేదని జవహల్‌లాల్‌నే అడ్డుకున్నది.

ఇక జాలి గుణంలో దుర్గాబాయమ్మను మించినవారు లేరు. టంగుటూరి ప్రకాశంగారు స్వరాజ్యోద్యమంలో అరెస్టయ్యారు. ఎందుకోవారింటికి వెళ్ళి చూస్తే- ఇంట్లోనివారు భోజనం కూడా లేకుండా గర్భదారిద్రం అనుభవిస్తున్నారు. ఆమె హృదయం కరగిపోయింది. దుర్గాబాయమ్మ వద్ద కూడా డబ్బు లేదు. మెడలోని గొలుసు, చేతికున్న రెండు జతల బంగారు గాజులు అమ్మగా వచ్చిన 1200 రూపాయల డబ్బును తిండికి అవసరమైన దినుసులను ఆ కుటుంబానికి అందజేసి వెళ్ళింది. ఆమె ధైర్యవంతురాలు. కాంగ్రెస్‌వారు చేసిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని పిడికెడు ఉప్పు పడుతూ, పోలీసు లాఠీదెబ్బలు తినగా చేయి రక్తసిక్తమయింది. అయినా ఉప్పును నేలరాలనీయలేదు. అలా ఆమె రెండు మూడు పర్యాయములు కారాగార శిక్ష అనుభవించింది.

దుర్గాబాయమ్మ చేసినన్ని సామాజిక కార్యక్రమాల నెవరూ చేసి ఉండరు. ఆమె ఢిల్లీలో ఆంధ్ర విద్యా సంస్థ పక్షాన ఓ ఉన్నత పాఠశాలను స్థాపించారు. ఢిల్లీలో ఉన్న ఇంకోగల్లీలో ఉన్నప్పటికినీ తెలుగువారి సేవను విడువలేదు. ఆమె తెలుగుతనపు చీరకట్టునూ విడువలేదు. చెవులకూ, ముక్కుకు, మెడకు ఉన్న ఆభరణాలనెప్పుడో గాంధీగారి స్వాతంత్ర్య సమరనిధి కిచ్చేసినట్లు యీ వ్యాసంలోనే ఉదహరించాను. కానీ ఆమె మరల వాటిని ధరించిన దాఖలాలు లేవు. నెహ్రూగారామె నిస్వార్థ పరయాణత్వానికి అబ్బురపడి సామాజిక సేవా అధికారిణిగా నియమించారు. ఆ పదవిలో ఆమె లక్షా యాభైవేల గ్రామాల్లో సేవా సంఘాలు యేర్పాటు చేసారు.

## లేటు వయసులో ఘాటు ప్రేమ వివాహం

1951వ సంవత్సరంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న చింతామణి దేశ్‌ముఖ్ గారిని మనసుపడి వివాహం చేసుకున్నారు. ఈ వివాహాన్ని జవహర్‌లాల్ నెహ్రూ దగ్గరుండీ జరిపించారు. అప్పుడాయనకు కాకినాడ కాంగ్రెస్ మహాసభ ప్రవేశద్వారం వద్ద నెహ్రూగారిని ప్రవేశపత్రం చూపమని అడిగిన బాలవలంటీర్‌గా ఎరుగరేమో! నెహ్రూగారు తన పెళ్ళి జరిపిస్తారనే విషయం ఆవిడా ఊహించి ఉండదు. అయితే నేను దగ్గరుండీ జరిపించిన విచిత్ర వివాహం అన్నారు నెహ్రూ.

వారి పెళ్ళిపత్రంలో నెహ్రూ, జె.బి. కృపాలినీ దంపతులు సాక్షి సంతకం చేసారు. ఇందిరాగాంధీ ఈ వివాహమునెంతో ఆసక్తికరంగా చూసింది.

దుర్గాబాయమ్మ మాతృదేశం, మాతృభాష పట్లగల వాత్సల్యానికి ఆంధ్రమహిళా సభ స్థాపనం. వికలాంగులకు, వితంతువులకూ, అనాధ స్త్రీలకు విద్య, ఉపాధి కల్పించిన ధీరవనిత దుర్గాబాయమ్మే! మద్రాసు మాదీ! మద్రాసు విడిచివెళ్ళం- అని నినాదాలు చేసిన నాయకమణ్యులుగానీ, వణిక్ప్రముఖులుగానీ 'ఆంధ్ర' పదాన్ని వాడుకోలేదు. ఆమె ఆంధ్ర మహిళాసభ యనేపేరుకు చిరస్థిర విలువ తెచ్చారు. ఆమెకు నెహ్రూ లిటరసీ అవార్డు, ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదములే గాకుండా – దంపతులురివుర్నీ కేంద్ర ప్రభుత్వం 'పద్మవిభూషణ్' బిరుదము లొకేసారి ప్రదానం చేస్తూ గౌరవించింది.

'జాతస్య మరణం ధృవమ్' అన్నట్లు స్త్రీజనాని కెంతో కాంతినీ, క్రాంతినీ తెచ్చిన ధీరవనిత దుర్గాబాయి1981 మే 9 వ తేదీన మరణించారు. ప్రగతిపథంలో ఉన్న ప్రతీ మహిళా దుర్గాబాయమ్మను స్మరించుకోక తప్పదు. ●

దుర్గాబాయమ్మ అనేసరికి ఆంధ్రమహిళా సభే గుర్తుకు వస్తుంది. మహిళల అభ్యున్నతి కోసం, అవిద్యానివారణ కోసం, అసహాయస్థితీ నిర్మూలనం కోసం, వృత్తి, విద్య, ఉపాధులు కల్పించడంలో ఆమెచేసిన అహరహకృషి అపారం. ఆమె కెవరూ సములు కాదు, ఏ విషయంలోనూ సములు కారు.

పదకొండేళ్ళ వయసులోనే మహాత్మాగాంధీని చూచి వొళ్ళంతా దేశసేవను పూసుకుంది. గాంధీ గారు ఆమె చేతి బంగారు గాజులు చూసి స్వతంత్రోద్యమానికి యివ్వమంటే వెంటనే చేతుల్నుండీ తీసి యిచ్చేసింది. పదేళ్ళకే ఆమె హిందీభాష నేర్చుకోవడమే కాదు. హిందీలో పాండిత్యం సంపాదించింది. ఖద్దరు వస్త్రాలను ధరించింది. ఆంధ్రదేశంలో ప్రప్రథమ హిందీ పాఠశాలను ఆమెయే ప్రారంభించింది. జమ్నాలాల్ బజాజ్ ఈ పాఠశాలను చూచి నడిపేదెవరు అనగానే పరికిణీ, గౌనుతో నున్న దుర్గాబాయ్‌ని చూపించారు. ఆయన ఆ పిల్లను చూచి ఆశ్చర్యపోయారు; ఆనందం వ్యక్తం చేసారు. ఇంతటి చిరువయసులో ఎంతో పరిణితి చెందిన వారెందరున్నారు? ఒక్కరే ఒక్కరు! ఆమే గుమ్మిడిదల దుర్గాబాయి. ఈనాటికీ జవసత్వాలతో నడుస్తున్న ఆంధ్ర మహాసభ స్థాపకురాలు. దేశమంతటా మహిళా దీప్తికి సేవ ల్జేసిన తొలి నాయకురాలనే కన్నా సేవకురాలని చెప్పాలి.

Beautiful City - Beautiful Hotel


Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225



# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

89

## పదునైదవ అధ్యాయము - పురుషోత్తమప్రాప్తియోగము

**9. శ్రోత్రం చక్షుఃస్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే.**

**వ్యాఖ్య:-** 'అధిష్ఠాయ మనశ్చాయమ్' - మనస్సును, ఇంద్రియములను ఆశ్రయించి- అని చెప్పుటవలన జీవుడు (జీవాత్మ) వాస్తవముగ మనస్సు కంటెను, ఇంద్రియములకంటెను వేఱుగనున్నాడనియు, ఇంద్రియ మనంబులు ఉపాధిరూపములేయనియు, (అజ్ఞానవశమున) ఆ ఉపాధిని ఆశ్రయించి అతడు సుఖదుఃఖముల ననుభవించుచున్నాడనియు స్పష్టమగుచున్నది. కాబట్టి మనో వికారములుగాని, ఇంద్రియవికారములుగాని ఆత్మకుజెందవు. తనకంటె వేఱైన ఇంద్రియమనంబులను ఉపాధిరూపమైన తొడుగును ధరించి ఆత్మ (జీవుడు) విషయాదులను, సుఖదుఃఖాదులను అనుభవించుచున్నాడు. కావున వాస్తవముగ ఆ ఉపాధితోగాని, ఉపాధిజనిత వికారములతోగాని ఆ యాత్మకు ఏలాటి సంబంధ మున్నూ లేదు.

**10. ఉత్క్రామన్తం స్థితం వాఽపి భుఞ్జానం వా గుణాన్వితమ్**
**విమూఢా నానుపశ్యన్తి జ్ఞానచక్షుషః**

**వ్యాఖ్య :-** భగవంతుడు మాకేల కానుపించకున్నారని అనేకులు ప్రశ్నించుచుందురు. దానికి, సమాధానమును శ్రీకృష్ణమూర్తి ఈ శ్లోకమున నొసంగిరి. నీవు జ్ఞాననేత్రమును (ఆత్మానాత్మవివేకమును) సంపాదించినచో ఇచ్చటనే, ఈ శరీరము నందే పరమాత్మను దర్శింపంగలవు, అని భగవానుడు నుడువుచున్నాడు. వారికై దూరమున వెతకనక్కఱలేదు. జీవునియొక్క స్వశరీరముననే ఆతనిని కనుగొన వచ్చును. తినుచు, త్రాగుచు, అనుభవించుచున్న ఆ వ్యక్తిని వివేచనతో, సూక్ష్మదృష్టితో, జ్ఞాననేత్రముతో మనుజుడు కనుగొనగలడు (పశ్యన్తిజ్ఞానచక్షుషః). ప్రాపంచిక దృశ్యవాసనాప్రాబల్యమువలన అజ్ఞానులాతనిని తెలిసికొనజాలకున్నారు. అద్దమును ప్రపంచమువైపు త్రిప్పి పట్టుకొనినచో ముఖము అందు కానరాదు. తనవైపు త్రిప్పుకొనినచో మాత్రమే కానవచ్చును. అట్లే మనస్సును బహిర్ముఖముగ, చపలముగ, వాసనాయుక్తుముగ గావించినచో ఆత్మ వస్తువు అందు గానరాదు. అంతర్ముఖముగ, నిశ్చలముగ, వాసనరహితముగ నొనర్చిన మాత్రమే కానవచ్చును. నిశ్చలమనస్సు, ఆత్మానాత్మవివేకము కలవానికే ఆత్మదర్శనము, లేక భగవద్దర్శనము అగుచుండును. (ఇచట భగవద్దర్శనమనగా భగవదనుభూతి యని అర్థము)

'ఉత్క్రామన్తం...' అని చెప్పుటచే ఆత్మ జీవరూపమున ఈ శరీరమందే తినుచు, త్రాగుచు, మఱియొక శరీరమును బొందుచున్నదని తెలియుచున్నది. కావున ముముక్షువులు భగవద్దర్శనమునకై దూరదూరముగ బోనక్కఱలేదు.

జ్ఞాననేత్రముచే మహనీయు లాయాత్మకు తప్పక చూడగల్గుచున్నారని ఇట చెప్పుటవలన జీవితమునందు ప్రతి మానవుని యొక్క ప్రథమకర్తవ్యము (అవివేకమును బోగొట్టుకొని, విషయవిరక్తిగలిగి మనస్సును బయటకు పరుగెత్త నీయకుండచేసి జ్ఞాన విచారణ ద్వారా, హృదయపరిశోధనద్వారా లోనగల) ఆత్మ నెఱుంగుటయే యగును. 'పశ్యన్తి జ్ఞానచక్షుష' అని అసందిగ్ధముగ చెప్పివేయబడి నందువలన జ్ఞాననేత్రమును సంపాదించుటయే తరువాయి భగవద్దర్శనము జీవునకు లభించియే తీరునని స్పష్టమగుచున్నది. అట్టి జ్ఞాననేత్రములేనిచో, జీవితము నిరర్థకమే కాగలదు.

**11. యతన్తో యోగినశ్చైవ పశ్యన్త్యాత్మన్యవస్థితమ్**
**యతన్తోఽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్య చేతసః**

**వ్యాఖ్య :-** అనేకులు భగవత్ప్రాప్తికై యత్నించుచున్నప్పటికిని అందులో కొందఱు సఫలురగుటకును, కొందఱు విఫలురగుటకును కారణమేమియో ఇచట తెలుపబడుచున్నది. చిత్తశుద్ధిగలిగి యత్నించువారు తప్పక సాఫల్యమును బొందగలరు. అనగా పరమాత్మను తమయందు సాక్షాత్కరించుకొనగలరు. కాని అదే ప్రయత్నము, అవే ధ్యానాదులు గావించుచున్నప్పటికిని, మలినచిత్తులు, సంస్కరింపబడని మనస్సుగలవారు, పరమాత్మను సాక్షాత్కరించుకొనజాలరు. కొందఱు శాస్త్ర పాండిత్యము మున్నగునవి మాత్రము కలిగి హృదయపవిత్రత లేక ఆత్మాన్వేషణమునకై ఉపక్రమింతురు. మఱికొందఱు కేవలము వేషధారులుగా నున్నవారై ధ్యానాదులను చేయుచున్నట్లు కనుపించుచుందురు. అట్టివారు ఇంద్రియ నిగ్రహము లేని కారణముచేతను, చిత్తశుద్ధి లేనందువలనను ఆత్మను తమయందు గాంచజాలరని ఈ శ్లోకమున ఘంటాపథముగ చెప్పివేయబడినది. క్షేత్రమును బాగుగా దున్ని, కలుపుతీసి, శుద్ధముచేసి, ఎరువుచల్లి ఆ పిదప విత్తనము వేసినచో చక్కగ పైరగును. అట్లుకాక, దున్నక, కలుపుతీయక వేసినను, లేక ఊషరక్షేత్రమునవేసినను ఆ విత్తనము మొలవదు. ఒకవేళ మొలచినను పెరగదు. ఒకవేళ పెరిగినను ఫలించదు. అట్లే సాధనచతుష్టయ సంపత్తి మున్నగువాని ద్వారా చిత్తమును మున్ముందు శుద్ధ మొనర్చు కొనినచో, అత్తఱి ఆత్మవిచారణాధ్యానాదులచే అతి సులభముగ ఆత్మ యనుభూతము కాగలదు. అవి లేనివారు ఎంత ప్రయత్నించినను ఆత్మను చూడజాలరు. భగవద్దర్శనమునకై రెండు విషయములు ప్రతివారికి అత్యవసరములని ఇచ్చోట తెలుపబడినది. అవియేవి యనిన- (1) ప్రయత్నము (2) చిత్తశుద్ధి - ఈ రెండును గలవారికి పరమాత్మ తప్పక అనుభూతుడు కాగలడు. రెండును అవసరములే. 'యతన్తః'- అని చెప్పబడుటవలన పరమార్థ మార్గమున ప్రయత్నము అత్యావశ్యక మని తెలుచున్నది. అయితే ఆ ప్రయత్నమునకు చిత్తశుద్ధియు తోడుగా నున్నపుడు అది యింకను ప్రకాశించును. ఇచట 'అచేతస' అని చెప్పబడినదానికి అర్థము కేవలము మూఢులని అజ్ఞానులని, నాస్తికులని కాదు. ఏలయనిన ఆ యత్నించు వారికి దైవమును పొందవలెనను తలంపుగలదు. ముముక్షుత్వము కలదు. లేకున్న వారు భగవత్ప్రాప్తికై అసలు ప్రయత్నమే చేయరుగదా! వీరు ప్రయత్నము చేయుచున్నారు. కాని వక్రమార్గమున, అపసవ్య పద్ధతిలో చేయుచున్నారు. అట్టివారు అనుభవజ్ఞులగు పెద్దల సాంగత్యము చేసినచో సత్యమార్గమును కనుగొని తరించగలరు. దైవమార్గమున ప్రయత్నము మంచిదే కాని దానికి చిత్తశుద్ధికూడ తోడైనచో ఇంకను రాణించును. బాగుగా ఫలించును. మోటుగా సాధనచేయుటవలన గొప్ప ప్రయోజనములు చేకూరవు; సాధనపద్ధతిని, సాధన రహస్యములను భగవత్ప్రోక్తములగు ఇట్టి వచనములవలనను, సద్గ్రంథమువలనను, మహాత్ముల సాంగత్యమువలనను తెలిసికొని ముముక్షువులు సక్రమపద్ధతిలో ధ్యానించి తరించవలయును.

**12. యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్**
**యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌతత్తేజో విద్ధి మామకమ్**

**వ్యాఖ్య:-** సూర్యాది ప్రకాశక పదార్థములందలి తేజస్సు తనదియని భగవానుడు తెలుపుటవలన ఆ యా వస్తువులను దర్శించినపుడు అవి భగవద్విభూతులే యను భావన గలిగియుండవలెను. ప్రపంచములో అనేక పదార్థములున్నప్పటికిని వాని యన్నింటికిని మఱియొక వస్తువును ప్రకాశింపజేయు సామర్థ్యము లేదు. సూర్యచంద్రాగ్నులకు మాత్రమే కలదు. అవి తాము ప్రకాశించును; ఇతరమును గూడ ప్రకాశింపజేయుచుండును. వానియందలి ఆ ప్రకాశక శక్తి, ఆ తేజస్సు భగవానుని విభూతియే అయియున్నదని ఈ శ్లోకము ద్వారా తెలియుచున్నది. (అయితే సూర్యాదులు ప్రకాశింపజేయుననియు ఈ సందర్భమున జ్ఞాపకము నందుంచుకొనవలెను.)

**(తరువాయి వచ్చే సంచికలో)**